నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
బుధవారం | ఫిబ్రవరి 12, 2025 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన బోడకుంటి చిన్న రాయమల్లు ఇటీవల నాగసముద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి ఖర్చు నిమిత్తం మాజీ ఎంపీపీ ఆకుల రాజేందర్, మాజీ ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి ఆధ్వర్యంలో దాతల ద్వారా సేకరించిన రూ.1.28లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు సాయం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బోడకుంట కిషన్, అడ్డగురి వెంకటేష్, ఇండ్ల నగేష్, లక్కాకుల రాజశేఖర్, ఎర్రం మల్లేష్, కుమార్, శ్రీకాంత్, రమేష్, తిరుపతి పాల్గొన్నారు.



వృద్ధుడి వద్ద రూ.2000 అపహరణ



జన్నారం : వృద్ధుడికి మాయమాటలు చెప్పి రూ.2000తో ఉడాయించిన ఘటన మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు చిందం కృష్ణయ్య పెన్షన్ డబ్బుల కోసం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకుకు వచ్చాడు. డబ్బులు తీసుకొని కిందికి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వృద్ధుడితో ఎన్ని డబ్బులు ఉన్నాయి..అవి నాకు ఇస్తే డబుల్ చేసి ఇస్తానని నమ్మబలికాడు. నమ్మిన వృద్ధున్ని ఎవరూ లేని స్థలంలోకి తీసుకెళ్లి రూ.2000 తీసుకున్నాడు. ప్రధాన రహదారిపై ఉన్న కృష్ణ జిరాక్స్ సెంటర్ వద్దకు తీసుకొచ్చి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ ఇవ్వాలని సెంటర్ నిర్వాహకులకు సూచించాడు. వారు జిరాక్స్ తీసి ఇచ్చేలోపే గుర్తు తెలియని వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. జిరాక్స్ నిర్వాహకులు వృద్ధుడిని జిరాక్స్ డబ్బులు ఇవ్వమని అడిగితే అయన వచ్చి ఇస్తాడని చెప్పాడు. అతను ఎంతకూ రాకపోవడంతో మోసపోయానని వృద్ధుడు కృష్ణయ్య లబోదిబోమన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సీసీ పుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.

ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిని తొలగించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2024 డీఎస్సీలో ఫేక్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను వెంటనే తొలగించాలని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంబ్లె ప్రజ్ఞశీల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. నకిలీ బోనాఫైడ్ ఇచ్చిన ఉట్నూర్ సన్‌సైన్ స్కూల్ ప్రిన్సిపల్ షబీర్‌పై క్రిమినల్, చీటింగ్ కేసులు నమోదు చేసి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. సర్టిఫికెట్స్ పరిశీలనలో ఆలసత్వం వహించిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తింపు లేని కాలేజీల ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన పీఈటీ, పీడీలను తొలగించాలన్నారు. నకిలీ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగాలు పొందినట్టు ప్రభుత్వ ఇంటలిజెన్స్ విభాగం గుర్తించిందని, అధికారుల రిపోర్ట్ ఆధారంగా ఫేక్ ఉద్యోగస్తుల లిస్టును ప్రభుత్వం బహిర్గతం చేయాలన్నారు. ఫేక్ ఉపాధ్యాయులను తొలగించి తర్వాత ర్యాంక్ వచ్చిన అభ్యర్థులతో ఉద్యోగాలు భర్తీ చేయాలని తెలిపారు. డీఈఓను విధుల నుంచి తొలగించాలని, లేని పక్షంలో దళిత, ఆదివాసీ విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి తెలంగాణ రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిడాం జంగుదేవ్ పటేల్, టీఎస్ఎస్ఓ జిల్లా అధ్యక్షులు జాడి వెంకటేష్ నేత, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఇన్‌చార్జి మంగం దీపక్ కుమార్, నాయకులు ఆత్రం ఉపేంద్ర, కోటేష్, తుకారాం, మోతీరాం పాల్గొన్నారు.

టోల్ ప్లాజా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

గంజాల్ టోల్ ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశాడు. 19 రోజులుగా కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవేను ప్రవేట్ కంపెనీలకు రూ.6500 కోట్లకు అమ్ముకొని, కార్మికుల పొట్ట కొడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించామని తెలిపారు. నూతనంగా కార్మికులను నియమించుకోవద్దని, టెండర్ దక్కించుకున్న కంపెనీలు పాత వారిని తొలగించవద్దని ఈ నెల 18న నేషనల్ హైవే కమిషనర్‌తో యూనియన్ నాయకుల చర్చలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. చర్చలు సఫలం కాని యెడల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రమేష్, కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గంగాధర్ రాజేశ్వర్, నవీన్, సహాయ కార్యదర్శులు గంగాధర్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఏఓఐ నాయకత్వంలో ఢిల్లీలో ధర్నా



నవతెలంగాణ-మంచిర్యాల

ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం పార్లమెంట్ ముందు జరిగిన మహా ధర్నాలో మంచిర్యాల ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఓఐ కరీంనగర్ డివిజన్ అధ్యక్షులు పి.రాజబాబరెడ్డి మాట్లాడుతూ బీమా ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని, బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితి పెంపును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెంట్ల కమిషన్‌ను తగ్గించే ప్రయత్నాలను విరమించుకోవాలని, ఏజెంట్ల ప్రయోజనాలకు భంగం కలిగించే బీమా సుగం పోర్టబిలిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఎల్ఐసి ఏజెంట్ల ప్రయోజనాల కోసం సంక్షేమ చర్యలు చేపట్టాలని పోరాటాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బ్రాంచ్ బాధ్యులు గంగధారి తిరుపతి, కటకోజ్వల మహేష్, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, స్వామి, వేణు, అశీర్ విల్సన్, రాజు పాల్గొన్నారు.

చిల్కూరి ప్రధాన అర్చకుడిపై దాడికి ఖండన

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

చిల్కూరి బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడిపై జరిగిన దాడిని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్ ప్రకటన విడుదల చేశాడు. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన బాలాజీ టెంపుల్ అభివృద్ధి కోసం రంగరాజన్ ఎంతో కృషి చేశారన్నారు. లౌకికవాది, ప్రజాస్వామ్యవాది, పరమత సహనం కలిగిన వ్యక్తిపై మతోన్మాదులు దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి మూడు నెలల్లోనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూజారులపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, మతోన్మాదం పేరుతో దాడులు చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.

పత్తి కొనుగోలు చేయాలని రైతుల నిరసన

- సీపీఐ(ఎం) నాయకుల మద్దతు
- కొనుగోలు నిలిపేస్తూ ఉత్తర్వులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పత్తి రైతుల ఇబ్బందులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే పత్తి దిగుబడి పెరగడంతో మిల్లులకు వచ్చే పత్తి వాహనాల సంఖ్య పెరుగుతున్నాయి. సీసీఐ అధికారులు జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తిని కొనుగోలు చేస్తున్నప్పటికీ సరైన విధానం లేకపోవడంతో రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో విసుగు చెందిన రైతులు వాహనాలతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జిల్లాలోని వివిధ జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకొచ్చిన రైతులు తమ వాహనాలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మూడు రోజుల నుండి జిన్నింగ్ మిల్లుల ఎదుట పత్తి వాహనాలతో ఉన్నామని, అధికారులు ఏదో ఒక వంకతో పత్తి తీసుకోకపోవడంతో వాహనాల కిరాయి పెరిగి నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.





సీపీఐ(ఎం) నాయకుల మద్దతు

పత్తి రైతులు చేస్తున్న నిరసనకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్ మద్దతు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి షరతులు లేకుండా రైతుల దగ్గర నుండి పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అండగా ఉంటామని తెలిపారు.

పత్తి కొనుగోలు తాత్కాలిక నిలిపివేత

ఆధార్ ఆథెంటికేషన్ పనిచేయడం లేదని, ఆధార్ ఆథెంటికేషన్ పనిచేసే వరకు పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ ప్రకటించడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. నాలుగు రోజుల నుండి పడిగాపులు కాసి కిరాయి వృథా అయిందని వాపోయారు. రైతులను ఎవరు కూడా పట్టించుకోవడం అసహనం వ్యక్తం చేశారు. అధికారుల ముందుచూపు లేమితో రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.

మద్దతు ధర అందించడానికే వివరాల సేకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు మద్దతు ధర అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వసతులు, పంటల వివరాలను తెలుసుకుంటుందని రాష్ట్ర మార్కెటింగ్ అడిషనల్ డైరెక్టర్ పి.రవికుమార్ అన్నారు. రాష్ట్ర మార్కెట్ పర్యటనలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఇక్కడ కల్పిస్తున్న వసతులు, పంటల కొనుగోళ్లు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు కనీస మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం మార్కెట్ యార్డులను సందర్శించి స్థితిగతులను తెలుసుకోవాలని సూచించిందన్నారు. అందులో భాగంగానే ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి వివరాలను సేకరించిన నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం 4 లక్షల 33 వేల ఎకరాల్లో పత్తి సాగైందని, 32 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా వేశారన్నారు. సీసీఐ ద్వారా ఇప్పటి వరకు 25లక్షల క్వింటాళ్లు, ప్రయివేట్ వ్యాపారులు లక్షా67వేల క్వింటాళ్లను మాత్రమే కొనుగోళు చేశారన్నారు. ప్రయివేట్ కంటే సీసీఐ ధర ఎక్కువగా ఉండడంతోనే రైతులు కూడా సీసీఐకే విక్రయించారన్నారు. అయితే ఆధార్ సర్వర్‌లో సాంకేతిక లోపం కారణంగా కొనుగోళ్లను నిలిపివేశారని, దాన్ని పునరుద్ధరించి మళ్లీ కొనుగోళ్లు చేస్తారన్నారు. అదే విధంగా మార్కెఫెడ్ ద్వారా ఐదు కేంద్రాలను ఏర్పాటు కందులను కొనుగోళు చేస్తున్నామన్నారు. అయితే ఎకరానికి 3క్వింటాళ్ల 30కిలోల పరిమితి ఉందని, దాన్ని 6 నుంచి 10 వరకు పెంచాలని రైతులు కోరుతున్నారన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రైతులు మార్కెట్ యార్డుల్లోనే తమ పంటలను విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శి మధుకర్, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

రాయితీ బియ్యం తరలిస్తే చర్యలు

- 208 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత
- వివరాలు వెల్లడించిన ఎస్పీ డీవీ శ్రీనివాస్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

పేదలకు ప్రభుత్వం అందించే రాయితీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ.శ్రీనివాస్ హెచ్చరించారు. సిర్పూర్ స్టేషన్ పరిధిలో మంగళవారం మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 208 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఎస్సై కమలాకర్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి హుడికిలి చెక్ పోస్ట్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఐచర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. డ్రైవర్ ఇషాక్ అహ్మద్‌ను ప్రశ్నించగా మహారాష్ట్రలోని వీరూర్ గ్రామానికి చెందిన ఉప్పరె సంతోష్, తన యజమాని మహమ్మద్ రజిక్ రహ్మాన్‌కు చెందినవని తెలిపాడు. అదే సమయంలో మినీ వాహనం రాగా అందులోనూ బియ్యం ఉందని తెలుసుకున్నారు. ఆ వాహన డ్రైవర్ మహమ్మద్ కలీం సల్మాన్‌ను విచారించగా ఈ రెండు వాహనాలకు ఒకరే యజమాని మహమ్మద్ రజిక్‌గా తేలింది. ఆయన కాగజ్‌నగర్ వాసిగా గుర్తించారు. మధ్యాహ్నం ఇటికలపహడ్ గ్రామానికి వెళ్లే దారిలో గ్రౌండ్ వద్ద చెట్ల పొదలో మినీ మహీంద్రా వ్యాన్ ఉందన్న సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. అందులో కూడా రాయితీ బియ్యం ఉంది. అందులో ఉన్న వ్యక్తి తనదేనని తానే డ్రైవరు, యజమాని అని ఒప్పుకున్నాడు. మహారాష్ట్రలోని వీరూర్ గ్రామానికి చెందిన ఉప్పరె సంతోష్‌కు సరఫరా చేస్తున్నామని తెలిపారు. మొదటి రెండు వ్యానుల యజమాని మహమ్మద్ రజిక్ రెహమాన్, మూడవ వాహనం యజమాని సయ్యద్ ఆరిఫ్‌ను విచారించగా భీమిని మండలం జనకాపూర్ గ్రామానికి చెందిన రాకేష్, అశోక్ దగ్గర కొనుగోలు చేసినట్టు ఒప్పుకున్నారు. పంచనామా నిర్వహిస్తున్న క్రమంలో ఇందులోని కొన్ని బియ్యం బస్తాలు రేషన్ షాపులో నుండి వచ్చినట్టుగా గుర్తించారు. మొదటి వాహనం ఐచర్ వ్యాన్‌లో 108 క్వింటాళ్లు, రెండో మినీ ఐచర్ వ్యాన్‌లో 42 క్వింటాళ్లు, మూడో వాహనంలో 58 క్వింటాళ్లుమొత్తం మూడు వాహనాల్లో కలిపి 208 క్వింటాళ్ల బియ్యం ఉందని, దీని విలువ రూ.7,48,800 ఉంటుందని ఎస్పీ వివరించారు. సరఫరా చేస్తున్న యజమానులతో పాటు డ్రైవర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. అక్రమ కార్యకలాపాలు నిర్వహించే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ బియ్యం పట్టుకున్న ఎస్సై కమలాకర్‌తో పాటు కానిస్టేబుళ్ల శశికాంత్, శరత్, సురేష్, పవన్‌ను ఎస్పీ అభినందించి రివార్డ్ అందజేశారు.



రేవంత్‌రెడ్డికి సీఎం పదవి శాశ్వతం కాదు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేవంత్‌రెడ్డికి సీఎం పదవి శాశ్వతం కాదని, అధికార దాహంతో బీసీ గణనలో 60 లక్షల నుండి 70 లక్షల వరకు బీసీలను లెక్కల్లో లేకుండా తప్పించారని బీసీ సంక్షేమ శాఖ మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మరోసారి బీసీలను మోసం చేసిందని, ప్రభుత్వం చేపట్టిన కుల గణన తప్పులు తడకగా ఉందని, కాంగ్రెస్ పుట్టిన నాటి నుండి నేటి వరకు బీసీలను మోసం చేస్తూనే వస్తోందని తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన బీసీలకు అన్యాయం చేకూర్చేలా ఉందన్నారు. 2011 సెన్సెస్ ప్రకారం తెలంగాణలో 3కోట్ల 50 లక్షల జనాభా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల తడక లెక్క చూపెడుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు, 2011 సెన్సెస్ ప్రకారం చూస్తే పదేళ్ల తర్వాత నాలుగు కోట్ల 30 లక్షలకు పైగా జనాభా ఉన్నప్పటికీ ఈ నివేదికలను ప్రస్తుత ప్రభుత్వం నమ్మకపోవడం సరికాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. 42 శాతం బీసీల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పిస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కులాల మధ్య రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిచ్చుపెట్టే ఆలోచన మానుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సమావేశంలో గంద్రత్ రమేష్, దాసరి రమేష్, సాజిదొద్దీన్, గంగయ్య, పండ్ల శ్రీనివాస్, కొండ గణేష్, నవతే శ్రీనివాస్, దమ్మపాల్, బట్టు సతీష్, పందిరి భూమన్న, కుమ్ర రాజు, పరమేశ్వర్, జంగిలి ప్రశాంత్ పాల్గొన్నారు.

అక్రమ ఇసుక నిల్వలపై ఎస్పీ కొరఢా

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక నిల్వలపై ఎస్పీ జానకి షర్మిల ఆకస్మికంగా దాడులు జరిపారు. గాజులపేట్, రాంనగర్, మంజులాపూర్ ప్రాంతాల్లో తిరిగి వాటిని సీజ్ చేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలించిన, నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక పోలీస్ టీం, స్పెషల్ టాస్క్ ఫోర్సెస్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్పీతో పాటు ఏఎస్పీ రాజేష్ మీనా, పట్టణ సిఐ ప్రవీణ్‌కుమార్, అర్బన్ తహసీల్దార్ రాజు పాల్గొన్నారు. తర్వాత పోలీస్ అధికారులతో ఎస్పీ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు.



జిల్లాలోని గోదావరి, స్వర్ణ, సుద్ధ వాగు పరిసర ప్రాంతాల నుండి ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో విశ్వసనీయమైన సమాచారం ప్రకారం 17 ఇసుక రీచ్‌లు, 35 ఇసుక నిల్వలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ అధికారులు, బ్లూకోర్ట్, పెట్రోలింగ్ కార్ సిబ్బందికి అక్రమ నిల్వలపై సూచనలు చేశారు.

బాధిత గల్ఫ్ కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన నిరుపేద గల్ఫ్ కార్మికుడు పూదరి నగేష్ కుటుంబానికి మంగళవారం గల్ఫ్ సభ్యుల సహకారంతో రూ.80,000, చింతగూడ గల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. దాతలు ముందుకు వచ్చి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు అన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

2వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లో మూడు రోజుల పాటు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రెండో బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం రెండో బెటాలియన్‌లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బెటాలియన్‌లో డ్యూటీ చేస్తున్న పోలీస్ అధికారులు, కానిస్టేబుల్స్‌కు వైద్య పరీక్షలు చేశారు. అందరికి ఎన్‌సీడీ స్క్రీనింగ్, టీబీ స్క్రీనింగ్, బ్లడ్ టెస్ట్ చేశామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంకోలి ఆధ్వర్యంలో డా .సర్వరాజ్, డా ఆశ కిరణ్, డా.కృష్ణవేణి, రిమ్స్ వైద్య సిబ్బంది, అంకోలి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాలలో జాబ్ మేళాకు స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో మంగళవారం టాస్క్ ఆధ్వర్యంలో జీఎల్ఐటీజెడ్ కార్ప్ కంపెనీలో సౌజన్యంతో జరిగిన జాబ్ మేళకు స్పందన లభించింది. ఈ మేళకు 75 మంది అభ్యర్థులు హాజరవగా, 15 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. అతీక్ బేగం తెలిపారు. కంపెనీ ప్రతినిధులు ఉష, సరోజ్ కుమార్, శ్రావణి పాల్గొని, అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రయివేటు రంగంలోను అవకాశాలు ఉంటాయని యువత దీనిని సద్వినియోగం చేసుకొని జీవితంలో రాణించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు, గణపతి, టీఎస్ కేసీ కోఆర్డినేటర్ డా.కోటయ్య, మెంటార్ చైతన్య కృష్ణ అధ్యాపకులు కృణాల్, చంద్రకాంత్ పాల్గొన్నారు.



కాలనీలో కనీస సౌకర్యాలు కరువు

- రోడ్లు, తాగునీటికి ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-తలమడుగు

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు కాని అలాంటి పల్లెల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాటిపై పర్యవేక్షించాల్సిన అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణాంగా కాలనీల్లో కనీస సౌకర్యాలు ఉండటం లేదు ఫలితంగా ఆ కాలనీ విద్యుత్, అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు, తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని కుచులాపూర్ గ్రామంలోని సాయిబాబా ఆలయం సమీపంలో గత ఐదు సంవత్సరాల కింద పేదలు ఇంటిస్థలాలను కొనుగోలు చేసి అక్కడ ఇండ్లు నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఆ కాలనీకి కనీస సదుపాయాలైన విద్యుత్, మురుగు కాలువలు, తాగునీరు, రోడ్డు సౌకర్యాలు లేకపోవడంతో వాటిని సమకూర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ కాలనీ వాసులు ఉదయం ఐదు గంటలకే నిద్రలేచి నీటి కోసం కష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపు లైన్‌లు ఉన్నప్పటికీ, ఆ కనెక్షన్ తమ కాలనీ వరకు లేదని పేర్కొన్నారు. దీంతో కనీసం నల్లాలు కూడ లేవని, నీటికోసం ఉదయాన్నే ఇబ్బందులు పడుతన్నామని, కొన్ని సందర్భాల్లో వ్యవసాయ పనులను మానేసుకోవాల్సి వస్తుందన్నారు. పక్కనే ఉన్న కాలనీ నుంచి నీటిని, అదేవిధంగా కట్టె స్థంబాలను ఏర్పాటు చేసుకొని విద్యుత్ వైర్లు తీసుకున్నామని తెలిపారు. కాని అవి కూడ ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తెలిపారు. వీధి దీపాలు లేక వర్షాకాలంలో పాములు, తేళ్లు, ఇండ్లలోకి వస్తున్నాయని తెలియజేశారు. అంతర్గత రోడ్లు లేక వర్షకాలంలో బురదలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. గత పాలకులు మిషన్ భగీరథ పథకం ద్వారా కొండల పైకి నీటిని అందించినప్పటికీ కొండల కింద ఉన్న తమ కాలనీకి కనీస సౌకర్యాలు కూడా అందించలేక పోతున్నారని వాపోయారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి, కనీస సౌకర్యాలు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదు

గత ఐదు సంవత్సరాల కింద ప్లాట్లను కొనుగోలు చేశాం. అక్కడ మట్టి గోడలతో ఇండ్లు నిర్మించుకొని నివాసముంటున్నాం. కాని కనీస సౌకర్యాలైన తాగునీరు, రోడ్లు మురుగు కాలువలు, విద్యుత్తు సౌకర్యం లేదు. గత ఎన్నికల్లో అన్ని పార్టీల నాయకులకు కాలనీ సమస్యలపై విన్నవించినప్పటికీ చూద్దాం.. చేద్దాం.. అంటూ ఓట్లు దండుకున్నారే తప్ప తమ సమస్యలు పరిష్కరించలేదు.



\- సంతోష్, గ్రామస్తుడు



కట్టె స్తంభాలను ఏర్పాటు చేసుకున్న కాలనీవాసులు

హీరాసుక జయంతిని విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 14న ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్డు గ్రామంలో ఆదివాసీ పురోహిత్ ప్రధాన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే హీరాసుక జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పిలుపు నిచ్చారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆదివాసీ ప్రధాన్ సంఘ సభ్యులతో కలిసి జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించిన మహనీయుడు హిరాసుక అని పేర్కొన్నారు. ఎక్స్ రోడ్డు గ్రామంలో జరిగే హిరసుక జయంతి వేడుకలకు ఆదివాసులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పురోహిత్ ప్రధాన్ సంఘం అధ్యక్షుడు కనక సంతోష్, గౌరవాధ్యక్షుడు మడవి దత్తు, ప్రధాన కార్యదర్శి సోయం రాందాస్, సలహాదారు గెడం నిరంజన్ పాల్గొన్నారు.

మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇస్తే చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చౌరస్తాలో నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేస్తు పత్రాలను చూశారు. నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలను సీజ్ చేసి, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ మాట్లాడుతూ పట్టణంలో నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలు తిరుగుతున్నాయన్నారు. అదే విధంగా మైనర్లు కూడా వాహనాలు నడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, 30 నుంచి 40 వాహనాలను పట్టుకున్నామన్నారు. నెంబర్ లేని వాహనాలకు నెంబర్ ప్లేట్స్ పెట్టించి, పెండింగ్ చలన్లు కట్టిన తరువాత విడుదల చేస్తున్నామన్నారు. అదే విధంగా పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి విడిచి పెడుతున్నామన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు.

మాలీ మహా సంఘం కమిటీలు ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అఖిల భారతీయ మాలీ మహా సంఘం జాతీయ అధ్యక్షులు విలాసరావు పాటిల్ అధ్యక్షతన సోమవారం జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర జిల్లా యువజన మహిళా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ రాష్ట్ర అధ్యక్షునిగా నాలుగోసారి సుకుమార్ పెట్కులే ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సురేష్ గురునులే, నారాయణ గురునులే ఎన్నికయ్యారు. రాష్ట్ర కోశాధికారిగా సతీష్ గురునూలే ఏకగ్రీవంగా ఎన్నికగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రామకృష్ణ బెజ్జూర్ ఎన్నికయ్యారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా వినోద నాగోషి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉజ్వల ఉమేష్‌రావు డోలే, ప్రధాన కార్యదర్శిగా వనిత చౌదరి, ఉపాధ్యక్షురాలుగా కోట్రంగి గోదావరి, కోశాధికారిగా లక్ష్మీ షిండే, సాంస్కృతిక కార్యదర్శిగా లీనా అంబేకర్, సంయుక్త కార్యదర్శిగా గంగుతాయి షిండే, శాలిని ప్రధాన్, కార్యవర్గ సభ్యులుగా మనిషా గురునులే, కల్పన పెట్కులే, స్మిత పెట్కులే, సంగీత గురుణులే, అంజలి పెట్కులే, తాను బాయి, తాంసి జన బాయ్ వాడై, సంజీవిన షిండే లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షునిగా అడ్వొకేట్ ఉమేష్ రావు డోలే, ఎన్నికగా కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాడై పాండురంగ్ ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా పటేల సంఘం అధ్యక్షునిగా నారాయణ షిండే ఎన్నిక కాగా, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షునిగా నాగోషే శంకర్, యువజన విభాగం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షునిగా మొహార్ల శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగోషిసాగర్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా కోట్రంగి సాగర్, వాడే సుధాకర్ ఎన్నుకోబడ్డారు. జాయింట్ సెక్రటరీగా ముహూర్లి తిరుపతి, సెండే చంద్రశేఖర్, మోర్లే సతీష్, మాండూరి ఉల్లాస్, ప్రచార కార్యదర్శిగా నికోడే రమేష్, ఉపాధ్యక్షులుగా లేనగురి శంకరులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఆదిలాబాద్ జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా నందకిషోర్ నాగోషి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్ కోట్రంగి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ ముహూర్లే ,కోశాధికారిగా రమేష్ గూరునులే, రాందాస్ మోర్లే ఎన్నిక కాగా, కార్యవర్గ సభ్యులుగా అశోక్ నాగోషే, సునీల్ షిండే, దత్త గురునులే, అశోక్ షిండే, సతీష్ లేనగురి, ఉద్ధవ్ వాడగురేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షునిగా విజయ్ వాడగురే, ప్రధాన కార్యదర్శిగా ఉత్తం వాడగురే, ఉపాధ్యక్షుడిగా విఠల్ కోట్రంగే, సంయుక్త కార్యదర్శిగా అంబాదాస్ షిండే, కోశాధికారిగా బండారి ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా సంతోష్ చౌదరి, రవీందర్ షిండే, బెల్లపు రమేష్, గజానంద్ గురునులేలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోంది

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల పాలనలో నిరుద్యోగులకు ఏం చేశారని ఈ ఎన్నికల్లో ఓట్లు అడుగుతారని అన్నారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు వాటిని అటకెక్కించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లతో బుద్ధి చెప్పాలని అన్నారు. పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, అయ్యన్నగారి భూమయ్య, మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, అయ్యన్నగారి రాజేందర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-జైనథ్

క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం మండలంలోని దీపాయిగూడ గ్రామంలో కృషి యూత్ ఆధ్వర్యంలో జోగు ఆశమ్మ భోజన్న జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి జోగు రామన్న హాజరయ్యారు. మొదటగా ఆయన బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాలలో క్రీడారంగంతో మంచి స్నేహ సంబంధం ఏర్పడుతుందని, అలాగే క్రీడల వల్ల రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి, ప్రతి ఒక్కరూ ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్, మాజీ ఎంపీటీసీ ఇందిరా రామ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగన్న, మాజీ సర్పంచ్ మాదాస్తు సురేఖ వెంకన్న, నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : శారీరక ధృఢత్వం ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించవచ్చని శారీరక ధృఢత్వానికి క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 2వ ఖేలో ఇండియాలో భాగంగా అథ్లెటిక్స్ ప్రయివేట్ స్కూల్ చాంపియన్ షిప్‌ను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ క్రీడలతోనే మానసికోల్లాసంతో పాటు శరీరం ధృఢంగా తయారవుతుందన్నారు. నేటి పిల్లలు సెల్ ఫోన్లకు ఆకర్షితులై లక్ష్యాలను సాధించలేకపోతున్నారన్నారని అన్నారు. చదువుతో పాటు ఆటల వైపు మళ్లితే భవిష్యత్తులో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. రోజు గంట సేపు ఆటలతో పాటు వ్యాయమానికి సమయం కేటాయించాలన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారు మరింత సాధన చేస్తు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి రాణించేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రాజేష్, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి నన్నెపు స్వామి, వీజీఎస్ అకాడమి నిర్వాహకులు రాకేష్, గుండి మహేష్, ప్రయివేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



20న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కడెం

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆరు గ్యారంటీలతో పాటు ఏడో హామీ ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరణ చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుబంధు ఎకరాకు రూ.15వేలు ఇస్తానని రూ.12వేలు మాత్రమే ప్రకటించారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో ప్రజా ప్రదర్శన బహిరంగ సభ నిర్వహించ తలపెట్టిందన్నారు. దీనికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు గోనే స్వామి, గూట్ల ప్రసాద్, ఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, రాములు, కుడుదుల రాజేష్, నరేష్ పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుకోవాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

చదువుతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలు నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఆదివాసీ గిరిజన సంస్కృతిక సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, డీఈఓ ప్రణీతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్ వాడకూడదన్నారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు వారి వారి సాంప్రదాయాలతో కూడిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో కలిసి అధికారులు నృత్యాలు చేస్తూ, అందరినీ అబ్బుర పర్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ బాస్కర్, ఎంఈఓ మనుకుమార్, ఉపాధ్యాయులు బండి సుభాష్, జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్మిక, రైతు చట్టాలతో అన్యాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు చట్టాలను తీసుకువచ్చి అన్యాయం చేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. మంగళవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. దీనికి ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు హాజరు కాగా, సంఘ బలోపేతం, మండల, జిల్లా, రాష్ట్ర మహాసభలపై చర్చించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడారు. దేశంలోని 140 కోట్ల జనాభాలో 80 శాతం ఉన్న రైతులు, కార్మికులను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. వారికి వ్యతిరేకంగా కోడ్‌లు, చట్టాలను తీసుకువస్తుందన్నారు. కార్మిక చట్టాలు రద్దు చేసి తీసుకువచ్చిన నాలుగు కోడ్లు, రైతు నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేసిన పార్లమెంట్‌లో ప్రస్తావించలేదన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై ఉద్యమించేందుకు ఏఐటీయూసీ నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గోవర్ధన్, సిర్ర దేవేందర్, సహాయ కార్యదర్శి కాంతారావ్, డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజెంగుల రాజు, ఎండీ ఖాసీం, గంగయ్య, రుక్మిణి, రమేష్, ఉస్మాన్ పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో వ్యవసాయ క్షేత్రాలకు రోడ్డు నిర్మాణం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని పెద్దవాగు నుంచి కిష్టాపూర్ శివారం వరకు రైతుల వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్ ముందుకు వచ్చి రోడ్డు నిర్మించారు. గత కొన్ని దశాబ్దాలుగా తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్‌ను కోరడంతో ఆయన వెంటనే స్పందించి తన సొంత నిధులతో ఎర్ర మొరం వేసి రోడ్డును నిర్మించారు. ఈ సందర్భంగా సామాజిక సేవకుడు మాట్లాడుతూ రైతులు తమ చేనులోకి వెళ్లేందుకు రహదారి సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. ఇటీవల సంబంధిత రైతులు తమ సమస్యలను తెలియజేయడంతో స్పందించి బోథ్ మండల కేంద్రంలోని పెద్దవాగు కబ్రాస్తాన్ నుంచి కిష్టాపూర్ శివారం వరకు ఉన్న రాళ్లదారిని బాగు చేయించి. సుమారు రెండు కిలోమీటర్ల రహదారిపై ఉన్న రాళ్ల రప్పలను తొలగించి, సొంత నిధులతో రోడ్డు వేయించామని అన్నారు. ఎన్నో ఏండ్లుగా రైతులు పడుతున్న కష్టాలు తొలగిపోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారని అన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి రథోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గోవిందమాంబదేవి సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి పట్టణంలోని పురవీధుల గుండా శోభయాత్ర కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరం విజయవంతం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి 58 మంది హాజరు కాగా అందులో 25 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు తెలిపారు. ప్రతీ మంగళవారం తమ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అఫ్తామలజిస్ట్ బియ్యల శ్రీనాథ్, వైద్య శిబిరం ఇన్‌ఛార్జి గోపి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని ఆగర్‌గూడ గ్రామంలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బహుమతులు అందించారు. టోర్నమెంట్ విజేత పూతపెల్లి జట్టుకు మొదటి బహుమతి రూ.20వేల నగదు, రన్నర్ అగర్‌గూడ జట్టుకు రెండవ బహుమతి రూ.పదివేలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సంజీవ్, శ్రీనివాస్, సుధాకర్, నాయకులు తిరుపతి, శ్రీనివాస్, మారయ్య కోనేరు యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అటవీ అనుమతులకు సరైన విధానం పాటించాలి



నవతెలంగాణ-తిర్యాణి

జిల్లాలో అటవీ అనుమతులు రాకుండా అసంపూర్తిగా ఉన్న రహదారులు పూర్తి కావడానికి నిర్దేశించిన విధానాన్ని పాటించాలని వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మెర్రూ సూచించారు. మండలంలోని ఆదివాసీ ప్రాంతమైన గుండాల రహదారి నిర్మాణాన్ని కవ్వాల్ టైగర్ జోన్ సీఎఫ్ శాంతారావు, కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సుశాంత్ సుఖదేవ్, తిర్యాణి రేంజ్ అధికారి శ్రీనివాస్, గిన్నెదరి రేంజ్ అధికారి సరోజరానితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వన్యప్రాణులకు ఇబ్బందులు కాకుండా రహదారుల నిర్మాణం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రహదారులకు జాతీయ పర్యావరణ పరిరక్షణ బోర్డు నుండి అనుమతి తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. గిరిజనులతో కలిసి అటవీ అధికారులు పనిచేయాలని, అప్పుడే పర్యావరణ పరిరక్షణతో పాటు అటవీ సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల పట్ల అవగాహన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సుల పట్ల అవగాహన కల్పించారు. దీనికి హాజరైన సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ టెక్నికల్ డైరెక్టర్ మంచికట్ల అనిల్‌కుమార్ (హైద్రాబాద్) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆధునిక సాఫ్ట్‌వేర్ కోర్సులైన పైథాన్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ తదితర కోర్సుల పట్ల అవగాహన కల్పించారు. సాఫ్ట్‌వేర్ రంగంపై ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రభావం అధికంగా ఉందని, రాబోయే రోజులలో ఆధునిక కంప్యూటర్ కోర్సులు అభ్యసిస్తేనే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించగలుగుతామని విద్యార్థులకు సూచించారు. సాఫ్ట్‌వేర్ రంగం-కెరీర్ పై విద్యార్థుల సందేహాలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం, అకడమిక్ కో ఆర్డినేటర్ డి జనార్దన్, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు జాడి శ్యాంరావు, రాజనర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

16న పదో తరగతి టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-తిర్యాణీ

ఈ నెల 16న భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా మండలాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు, పదవ తరగతి విద్యార్థులు విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులకు టాలెంట్ పరీక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి భవిష్యత్తు పునాదులకు బాటలు వేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించి తమ ప్రతిభను కనబరచాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు 7702664187, 9100277808 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు సులభతరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించడంలో భాగంగా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు మరింత సులభతరం చేశామని ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాథోడ్ శేషారావ్ స్పష్టం చేశారు. వినియోగదారునికి కొత్త సర్వీసుల మంజూరులో ఏదైనా కారణం చేత దరఖాస్తును తిరస్కరించకుండా వినియోగదారుడు తగు విధంగా స్పందించడానికి మరొక అవకాశం కల్పిస్తున్నామని, వివిధ కారణాల వలన డిపార్ట్‌మెంట్ రూల్‌కు లోబడి కొత్త సర్వీసుల మంజూరు ఆలస్యం కాకుండా ఉండేందుకు వినియోగదారునికి దరఖాస్తు చేసుకున్న దానిపై మెసేజ్ రూపకంగా ప్రతి ఒక్క దశలో వెళ్తుందన్నారు. వినియోగదారునికి అట్టి సర్వీస్‌పై మరింత అవగాహన ఏర్పడి వెంటనే సంబంధిత పత్రాలు జమ చేయడం వలన సర్వీసులు త్వరిత గతిన మంజూరు చేయడం జరుగుతుందన్నారు. టీజీ ఎస్‌పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా వివిధ దశల్లో ఉన్న అప్లికేషన్ స్థితిని తెలుసుకోవడానికి ఈ ట్రాకింగ్ సిస్టమ్‌ను రూపొందించడం జరిగిందన్నారు. వినియోగదారుడు మరింత సమాచారం తెలుసుకోవడానికి 1912కి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని వివరించారు.

లెక్క తేలింది.. ఓటింగ్ మిగిలింది..

- స్థానిక సంస్థల ఓటర్ జాబితా విడుదల
- పోరుకు సిద్ధమవుతున్న ఆశావాహులు



జిల్లాకు చేరిన ఎంపిటిసి ఓటర్ల జాబితా పత్రాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తయి సంవత్సరం కావడంతో ఎప్పుడెప్పుడు ఎన్నికలు జరుగుతాయని ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంలో కొద్దిరోజుల నుండి ప్రభుత్వం వేగంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వివిధ రకాల పనులపై దృష్టి కేంద్రీకరించినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి శిక్షకులను ఎంపిక చేసి హైదరాబాద్‌లో వారికి శిక్షణ ఇవ్వగా.. సోమవారం ఓటరు జాబితా విడుదల చేశారు. రిటర్నింగ్ అధికారుల నియామక ప్రక్రియను కూడా పూర్తి చేసింది. దీంతో ఒక్కసారిగా స్థానిక సంస్థల్లో ఎన్నికల వేడి రాజుకుంది.

లెక్క తేలింది.. ఓటింగ్ మిగిలింది..

రాష్ట్ర ఎన్నికల కమిషన్ త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. అయితే ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. ఓట్ల లెక్క తేలినప్పటికీ ఓటింగ్ కోసం రాజకీయ నాయకులు ప్రజలు ఎదురుచూస్తున్నారు.

జిల్లా ఓటరు జాబితా వెల్లడి

స్థానిక సంస్థల ఎన్నికల కోసం జిల్లాలో మండల వారీగా ఓటర్ల జాబితాను జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీనారాయణ విడుదల చేశారు. జిల్లాలో 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో 2874 వార్డులు, 127 ఎంపీటీసీ స్థానాలు 15 జడ్పీటీసీ స్థానాలున్నాయి. వీటిలో జిల్లా వ్యాప్తంగా 3,54,691 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుష ఓటర్లు 1,77105 మంది కాగా మహిళా ఓటర్లు 1,77,567 మంది ఇతరులు 19 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

పోరుకు సిద్ధమవుతున్న ఆశావాహులు

ఇప్పటికే తాము బరిలో ఉంటామంటూ గత సంవత్సర కాలం నుండి అన్ని పార్టీలను అంటిపెట్టుకొని అనేకమంది నాయకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలవడానికి అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నుండి కూడా నాయకులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అనుకూలంగా మార్చుకోవడానికి అధికార పార్టీ ప్రయత్నం చేస్తుండగా, అధికార పార్టీ లోపాలను బీఆర్ఎస్ టార్గెట్ చేయగా, సంస్కృతి సాంప్రదాయాలతో పాటు మతం ప్రాతిపదికన ఓట్లు రాబట్టే విధంగా బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. గత స్థానిక సంస్థల ఎన్నికలతో పోలిస్తే బీజేపీ కూడా బలోపేతం అయింది. అన్ని పార్టీల నుండి నాయకులు పోటీకి సిద్ధమవుతున్నారు. చూద్దాం అదృష్టం ఎవరిని వరిస్తుందో?

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే



భిక్షపతి గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి

స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశాం. రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వాటిపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటుంది. దీనికి సంబంధించి మెటీరియల్ కూడా జిల్లాకు చేరుకుంది. రానున్న ఒకటి రెండు రోజుల్లో రిటర్నింగ్ అధికారుల నియామక ప్రక్రియ పూర్తి చేసి వారికి శిక్షణ ఇవ్వనున్నాం. ఎన్నికలు ఎప్పుడు ప్రకటించిన నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

ప్రారంభమైన గంగాపూర్ జాతర

- తొలి రోజు స్వామి కల్యాణం
- పట్టువస్త్రాలను సమర్పించిన కలెక్టర్, ఏఎస్పీ దంపతులు
- నేడు రథోత్సవం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ జాతర వైభంగ ప్రారంభమైంది. తొలిరోజు శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారికి కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఏఎస్పీ చిత్తరంజన్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి కళ్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. మంగళవారం జాతరలో భాగంగా మొదటి రోజున నిర్వహించిన అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కొలువై ఉండడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. స్వామి కల్యాణ మహోత్సవానికి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, కొబ్బరి, మామిడి ఆకుల తోరణాలు, కనువిందు చేసే వివిధ రకాల పూలతో శోభాయమానంగా ముస్తాబు చేయడం జరిగిందని, వేడుకలలో భాగంగా వెంకటేశ్వర స్వామి, అలివేలుమంగ, పద్మావతి దేవతామూర్తులను అందంగా అలంకరించారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు, జాతర కమిటీ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యుల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణ మహోత్సవంలో వేద పండితులు దుద్దిల్ల నారాయణ శర్మ ధీరజ్ శర్మ, ఆలయ అర్చకులు గణేష్, దినేష్ శర్మ వేదమంత్రాలతో పూజలు నిర్వహించగా భక్తుల కరతాళ ధ్వనులు, భాజా భజంత్రీలు, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగిందన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న జాతరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని సురక్షితంగా వెళ్లేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ లోకేశ్వర్ రావు, సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్, రెబ్బెన తహసీల్దార్ రామ్ మోహన్, ఆలయ ఈఓ బాపురెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ

మండలంలో గంగాపూర్ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర అంగరంగా వైభవంగా మొదలైంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు మార్గాన్ని, ఏర్పాట్లను ఏఎస్పీ చిత్తరంజన్ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. రోడ్డు మార్గంలో వాహనాలు రద్దీగా ఉండకుండా, రహదారులపై వాహనాలు నిలపకుండా చూసుకోవాలన్నారు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని నేపథ్యంలో జేబుదొంగలు చేంజ్ వాచర్లు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక భద్రత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భక్తుల రాకపోకులకు మూడు రహదారులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐ బుద్దే స్వామి, ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



పదిలో మెరుగైన ఫలితాలు సాదించాలి

- హట్టి ఆశ్రమ పాఠశాల తనిఖీ చేసిన డిడి రమాదేవి



నవతెలంగాణ-కెరమెరి

పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలంటే స్వయం ప్రణాళిక, పాఠ్యాంశ పునశ్చరణతో పాటుగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని డీడీ రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని హట్టి ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పలు రికార్డులను పరిశీలించి ఆమె మాట్లాడారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గత సంవత్సరం కంటే అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఎంత వెనకబడి ఉన్నా మెరుగైన శిక్షణ ఇస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలగుతారన్నారు. వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. గత ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రయత్నించాలన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు అత్యధిక శాతం మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లోనే వెనుకబడి ఉన్నారని ఆలాంటి వారిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్లిప్ టెస్టులు, మాక్ టెస్టులు నిర్వహించి వాటిపై రివిజన్ చేస్తే విద్యార్థులకు ఫైనల్ పరీక్షల భయం పోతుందన్నారు. రివిజన్ చేస్తే విద్యార్థులు మరిచిపోరని తెలిపారు. ప్రాక్టీస్ ఎక్కువగా చేయించేలా ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలన్నారు. ఒత్తిడిని జయించేల నిత్యం యోగ, వ్యాయమాలను చేయించాలని ఆదేశించారు. అనంతరం ఓ తరగతిలోని విద్యార్థులతో ముచ్చటించారు. తెలుగు సబ్జెక్టులోని పలు విషయాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి గమినియల్ అన్నారు. టీ శాట్ ద్వారా విద్యార్థులకు విషయ నిపుణులచే జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రేరణ మరియు మార్గదర్శకత్వంపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. 10 జీపీఏ వచ్చే విధంగా చదవాలన్నారు. దీనికోసం మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించాలని సూచించారు. పాఠశాలలో నిర్వహించే ప్రతి పరీక్ష హాజరు కావాలన్నారు. అప్పుడే వార్షిక పరీక్షల పట్ల భయం పోతుందన్నారు. అంతకు ముందు పాఠశాల విద్యాశాఖ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా, డైరెక్టర్ నరసింహారెడ్డి విద్యార్థులను ప్రేరేపించే విధంగా పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ఆర్థిక ఖాతాల అధికారి జాడి దేవాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ప్రవేశాలు పొందాలి



నవతెలంగాణ-కెరమెరి

ప్రభుత్వ కళాశాలల్లోనే ప్రవేశాలు పొందాలని కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు నవీన్ రెడ్డి అన్నారు. మంగళవారం హట్టి ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో విద్యా బోధన, మౌలిక సదుపాయాల గురించి వివరించారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన లభిస్తుందన్నారు. పేద నిరుపేద విద్యార్థులు, పదవ తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొంది, నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

షాబే బారాత్‌కు ఏర్పాట్లు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 14న నిర్వహించే షాబే బారాత్‌కు పట్టణంలోని ఖబ్రస్తాన్‌లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ భుజంగరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గురువారం షాబే బారాత్ సందర్భంగా మసీదుల చుట్టుపక్కల, ఖబ్రస్తాన్‌లో ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించాలని, విద్యుత్తు లైట్లు బిగించాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు ఉబేద్ బిన్ యహియా (తారీక్) పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్యని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని దూపదీప నైవేద్యం స్కీమ్ జిల్లా అధ్యక్షుడు శిరీష్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రధాన అర్చకుడిపై దాడి చేయడం దారుణమని భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

తగిన మ్యాన్‌పవర్ ఇవ్వాలి

నవతెలంగాణ-రెబ్బెన

సీహెచ్‌పీల్లో తగినంత మ్యాన్ పవర్ లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు మొగిలి అన్నారు. మంగళవారం సీహెచ్‌పీ హెచ్ఓడీ ఎస్ఈ కోటయ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీహెచ్‌పీలో తగినంత మాన్ పవర్ లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, నెలనెలా కార్మికులు దిగిపోతున్నారని తెలిపారు. వారి స్థానంలో మ్యాన్ పవర్ పోస్టింగ్ చేయడంలో యాజమాన్యం శ్రద్ధ వహించడం లేదని, దీంతో కార్మికులపై పని భారం పెరుగుతుందన్నారు. అనంతరం ఏఐటీయూసీ పోరాటాలకు ఆకర్షితులై వివిధ యూనియన్‌ల నుండి పలువురు సీహెచ్‌పీ మెకానికల్ ఫోర్‌మెన్ రాజేష్, క్వాలిటీ విభాగం నుండి సారయ్య చేరాగా వారికి కండువా వేసి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.ఆనంద్, పిట్ కార్యదర్శి ఎంబడి రామయ్య, సహాయ కార్యదర్శి ఎల్తూరి శ్రీనివాస్, నాయకులు షమీ, సురేష్, కోరిగజ్జుల రాజయ్య, పాల్ అమర్ సింగ్, కాశి శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

నవతెలంగాణ-దండేపల్లి



శాంతిభద్రతల పరిరక్షణకు మండల ప్రజల సహకరించాలని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తాహసినుద్దీన్ అన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉదయ్ కిరణ్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఎస్ఐగా తాహసినుద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అవసరం ఉంటే తప్ప రాత్రి వేళలో బయటకు రావద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సీసీ కెమెరా ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

వీది కుక్కల దాడిలో గాయపడిన దుప్పి

నవతెలంగాణ-హాజీపూర్



జనవాసాల్లోకి వచ్చిన దుప్పి వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని గుడిపేట్‌లో చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం గుడిపేట్ శివారులోని ఎస్సీ కాలనీలోకి చుక్కల దుప్పి రావడంతో వీధి కుక్కలు వెంటపడి తరిమాయి. గమనించిన స్థానికులు కుక్కల బారినుండి దుప్పిని కాపాడి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సెక్షన్ ఆఫీసర్ అతహుల్లా, బీట్ అధికారి రాజేందర్ చుక్కల దుప్పి ఉన్న ప్రాంతానికి చేరుకొని అక్కడినుండి స్థానికులను అలికిడి చేయకుండా చేశారు. కొంత సేపు సేద తీరిన దుప్పిని ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువకు వెళ్ళేలా చేశారు. కాగా ఈ దుప్పి ఇటీవల కరీంనగర్ నుండి తీసుకువచ్చి క్వారీ సఫారీ రూట్‌లో వదిలిన దుప్పిగా గుర్తించారు.

గుడుంబా స్థావరాలపై దాడి

- 4 లీటర్ల నాటుసారా స్వాధీనం, ఇద్దరిపై కేసు



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిధి వివిధ గ్రామాల్లో గల గుడుంబా స్థావరాలపై పోలీస్ ఎస్సై శ్వేతతో కలిసి మంచిర్యాల, చెన్నూర్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించినట్లు మంచిర్యాల ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుసేన్ ఆధ్వర్యంలో మంచిర్యాల, చెన్నూర్ ఎక్సైజ్ ఎస్సైలు పనిషా రాథోడ్, శంకర్ మంగళవారం భూర్గుపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. దరావత్ రాములు నుండి 2 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోతన్‌పల్లి గ్రామంలో దాడులు నిర్వహించి జర్పుల స్వరూప నుండి 2 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆరెపల్లి, భీమారంలో కూడ దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా గుడుంబా తయారు చేసినా విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మందమర్రిలో డిజిటల్ క్రాప్ సర్వే



నవతెలంగాణ-మందమర్రి

మండలంలోని తిమ్మాపూర్ గ్రామాల్లో యాసంగికి డిజిటల్ క్రాప్ సర్వే విధానం ద్వారా పంటల నమోదు చేస్తున్నట్టు మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా ఎంపిక చేయబడిన గ్రామాల్లో సర్వే నెంబరు, సబ్ డివిజన్ నెంబర్ల వారీగా పంటల సాగు విస్తీర్ణాన్ని, పంట రకం, సాగు విధానం, నీటి వసతి వివరాలను క్షేత్రస్థాయిలోకి నమోదు చేశారు. అనంతరం మాట్లాడుతూ సేకరించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేకంగా రూపొందించిన ఏఈఓ లాగర్ యాప్‌లో పొందుపరుస్తున్నామని, సర్వే ద్వారా సేకరించిన పంటల గణాంకాలు పంటల సాగు వివరాలతో పాటు పంటల దిగుబడులను ఖచ్చితంగా అంచనా వేయడం, పంట కొనుగోలు అంచనాకు, పంటల బీమా అమలుకు, ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంట నష్టం వాటిల్లినప్పుడు అంచనాలు తెలుసుకోవచ్చని తెలిపారు. రైతులు డిజిటల్ క్రాప్ సర్వేకు సహకరించాలని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపుగా 2000 ఎకరాల్లో సర్వే పూర్తైనట్టు పేర్కొన్నారు.

నూతన డైరెక్టర్లను సన్మానించిన ఏఐటీయూసీ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థలో నూతనంగా ఎన్నికైన ఇద్దరు డైరెక్టర్లను సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ మంగళవారం హైదరాబాదులో సన్మానించారు. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్ ఆపరేషన్ ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిసి వారిని సన్మానించి పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ మనుగడకు, కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నవతెలంగాణ-జైపూర్

విద్యుత్ సమస్యల పరిస్కారం కోసం చెన్నూర్ పట్టణంలో గల విద్యుత్ సబ్ స్టేషన్‌లో ప్రత్యేక వేధిక ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఒక ప్రకటనలతో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతుందన్నారు. ఎస్ఈ గంగాధర్, డీఈ ఎంఎం ఖైసర్, ఇన్‌చార్జి ఏడీఈ వేణుగోపాల్ వేదికలో పాల్గొంటున్నట్టు తెలిపారు. భీమారం, జైపూర్, చెన్నూర్, కోటపల్లి మండలాల పరిధి విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లుల అభ్యంతరాలు, విద్యుత్ సరఫరాలో గల అభ్యంతరాలను ఈ వేదిక ద్వారా తెలియపర్చి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు.

ఘనంగా కుంకుమ పూజలు

నవ తెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గ్రామంలో గల శ్రీ నర నారాయణస్వామి ఆలయంలో మంగళవారం ఆ గ్రామ మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ పూజారి కాకరయ్య ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, హోమాలు, యజ్ఞాలు నిర్వహించారు. ఈ నర నారాయణ స్వామి ఆలయ జాతర ఐదు రోజులుగా నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. ఈనెల 9న అగ్గి మల్లన్న దేవస్థానంలో బోనాలు, 11న కుంకుమ పూజలు, 12న గీతా వాహనం అన్న ప్రసాద వితరణ ఈనెల 13న రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధి స్వదేశీ రావు తెలిపారు. కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు.

ఏఐటీయూసీ వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు సిద్ధం



నవతెలంగాణ-నస్పూర్

ఐకె1ఏ గనిలో ఏఐటీయూసీ నాయకులు సోమవారం సీఐటీయూపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనిపైన బహిరంగం చర్చకు సిద్ధమని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియలోని సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతూ విమర్శించడానికి ఎవరూ లేక సీఐటీయూకు కార్మికుల్లో వస్తున్న ఆదరణ చూసి గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ ఏఐటీయూసీ నాయకులు ఇష్టమొచ్చినట్టు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఏఐటీయూసీ నాయకుల మెడికల్ అన్ ఫీట్లు చేయిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేస్తున్నారనే అపవాదు తమకు లేదని, డిప్యూటేషన్లు, ట్రాన్స్‌ఫర్లు వంటి పైరవీలు చేయడం లేదని, కార్మికుల నుండి చందాలు వసూలు చేసి చనిపోయిన వారి పేరుపైన బిల్డింగులు కట్టి కిరాయికి ఇస్తూ డబ్బులు సంపాదించుకుంటున్నామనే అపవాదులు తమ సంఘానికి లేవన్నారు. కార్మికుల నుండి చందాలతో పాటు యూనియన్ మెంబర్‌షిప్ పేరు మీద సంవత్సరానికి రూ.1100 వసూలకు ఏఐటీయూసీ నాయకులు తెరలేపారని ఆరోపించారు. కాంట్రాక్టర్ల నుండి డబ్బులు తీసుకున్నట్లు సీఐటీయూ మీద అబద్ధపు ప్రచారం చేసిన ఏఐటీయూసీ నాయకులు నిరూపించాలని, విమర్శలపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. ఒకవేళ బహిరంగ చర్చకు రాకపోతే బేషరతుగా సీఐటీయూపై చేసిన వాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ తమ పార్టీ నాయకుల పైన ఎన్ని అక్రమ కేసులు పెట్టిన భయపడేదే లేదని స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటల్లో జైలుకు వెళ్లి వచ్చామని తెలిపారు. కాంగ్రెస్ ఓక్షపూరిత రాజకీయంలో భాగంగా కార్యకర్తకు ఇబ్బంది వచ్చినా, అక్రమ కేసుకు గురైన వారికి తోడు, నీడగా పార్టీతో పాటు తాము అండగా ఉంటామని కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. ఒక్కో కార్యకర్త వంద మంది కార్యకర్తలతో సమానమని, రాబోయే స్థానిక సంస్థలలో కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వాళ్ళకే ప్రాధాన్యత, అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఓడిన గెలిచిన నాయకులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమైన సందర్భంలో వారి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ నల్మస్ కాంతయ్య, మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు చుంచు చిన్నయ్య, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పాదం శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు అంకతి గంగాధర్, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉప సర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ వైస్ ఎంపీపీలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-తాండూర్

భూసార పరీక్షలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పొలాస, జగిత్యాల వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అనుభవ పూర్వక అభ్యసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తపల్లి గ్రామంలో భూసార పరీక్షలు నిర్వహించారు. మండలంలో భూసార సాగు నీటి సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సుష్మ మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా భూమిలోని పోషకాల సమతుల్యతను తెలుసుకొని పంటలకు ఎరువుల యాజమాన్యాన్ని పాటించవచ్చునని తెలిపారు. భూమిలోని నత్రజని బాస్వరం, పొటాష్ ఎరువుల పరిమాణాన్ని గుర్తించి పంటకు పైపాటుగా అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. భూమిలో ఎరువులు, సూక్ష్మధాతువుల శాతాన్ని లెక్కించి ఎరువుల యాజమాన్యాన్ని సమన్వయం చేయడంలో భూసార పరీక్షలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో మండలవ్యవసాయ అధికారి కే సుష్మ వ్యవసాయ విస్తరణ అధికారుల ఉప్పులేటి శంకర్, వెంకటేష్, వి వి.ధనలక్ష్మీ ,గ్రామ రైతులతో కలిసి మట్టి నమూనా సేకరించడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులు దుర్గంశ్రీధర్,చోప్పదండి తిరుపతి, రైతులు చొప్పరి సారయ్య, కొడిపే విమల పాల్గొన్నారు.

సంక్షేమ అధికారులు బాధ్యతగా ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమంలో ప్రతి ఒక్క సంక్షేమ అధికారి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ అన్నారు. డీజీఎం పర్సనల్ పి.అరవింద రావు అధ్యక్షతన శ్రీరాంపూర్ ఏరియా వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న సంక్షేమ అధికారులు, పర్సనల్ అసిస్టెంట్లు, పేషీట్ క్లర్క్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో ఉద్యోగ విరమణ పొందిన, అనారోగ్య సమస్యలతో మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగులకు సంబంధించిన అన్ని సెటిల్‌మెంట్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ అరవింద రావు మాట్లాడుతూ తప్పుగా ఇన్‌కాం టాక్స్ ఫైలింగ్ చేసిన వారు శ్రీరాంపూర్ ఏరియాలో అరుగురు ఉన్నారని, ఇప్పటివరకు ఇన్‌కాం టాక్స్ ఫైలింగ్ చేయని వారు 48 మంది ఉన్నారని, పాన్, ఆధార్ అనుసంధానం చేసుకోని వారు 155 మంది ఉన్నారని వీరందరూ ఈనెల 15లోగా ఈ పనులను పూర్తి చేసుకోని ఆ పత్రాలను సంబంధిత గనులు విభాగాలలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీవై పీఎం రాజేష్, సీనియర్ పీఓ పి.కాంతారావు, అకౌంట్స్ ఆఫీసర్ పద్మ పాల్గొన్నారు.

మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించిన అధికారులు

నవతెలంగాణ-జైపూర్

ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ మౌఖిక పరీక్షకు హాజరువుతున్న అభ్యర్థులకు హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన మాక్ ఇంటర్వ్యూలకు రాష్ట్ర ప్రభుత్వ ఇందనశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానీయా, సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్, ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పర్యవేక్షణలో మాక్ ఇంటర్వ్యూ కొనసాగాయి. సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వార సివిల్స్ ప్రిలిమినరీ పాసైన వారికి రూ. లక్ష, మెయిన్స్ పాసైన వారికి మరో రూ. లక్ష ప్రోత్సహకంగా అందిస్తున్న విషయం తెల్సిందే. ఈ పథకంలో భాగంగా ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు సంస్థ పేర్కొంది. అధికారులు పలు విధాలుగా ప్రశ్నించిన తరువాత తుది ఇంటర్వ్యూలను ఏవిధంగా ఎదుర్కొవాలి అనే అంశంపై పలు సూచనలు చేస్తున్నారు. ఆత్మ విశ్వాసంతో సిద్ధం కావాలని సందేహాల నివృత్తికి తాము ఎప్పుడు సిద్ధంగా ఉంటామని ప్యానెల్ సభ్యులు భరోసా ఇస్తున్నారు. అదేవిధంగా తెలంగాణ భవన్‌లో ఉండటానికి ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు లారీలు ఢీ

- ఒకరు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-మందమర్రి

పులిమడుగు వద్ద ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ప్రాంతంలో మంగళవారం రెండు లారీలు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. నేషనల్ హైవే సిబ్బంది లారీ ట్యాంకర్‌తో రహదారి మధ్యలోని చెట్లకు నీరు పోస్తున్న సమయంలో వెనకాల నుండి వేగంగా వచ్చిన మరో లారీ, ట్యాంకర్‌ని ఢీ కొట్టడంతో నీళ్ల పోస్తున్న లారీ ఎగిరి పడింది. ఢీ కొట్టిన వాహనదారుడు కనకయ్య(40) క్యాబిన్‌లో ఇరుక్కొని చనిపోయాడు. మరో వాహనదారుడు మాదాసు తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు కనకయ్య కన్నాల బసంత్ నగర్, తిరుపతి మందమర్రి రామన్ కాలనీ నివాసులుగా గుర్తించారు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహార పంపిణీ సక్రమంగా జరగాలి



నవతెలంగాణ-తాండూర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీ సక్రమంగా జరగాలని బెల్లంపల్లి సీడీపీఓ స్వరూప రాణి తెలిపారు. మంగళవారం మండలంలోని రేచిని రైల్వే స్టేషన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీ, ప్లే స్కూల్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో గృహ సందర్శనలు చేసి గర్భిణులకు ఆహార నియమాలను వివరించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్లే స్కూల్ ద్వారా పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం మాదారం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ టీచర్ మీనా గృహ సందర్శన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులకు పౌష్టికాహారం, ఆరోగ్యం, ఆహార నియమాలపై అవగాహన కల్పించారు.

సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శన



నవతెలంగాణ-నస్పూర్

పిల్లలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శన దోహద పడుతుందని మండల విద్యాధికారి దామోదర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ రెయిన్ బో పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి వైజ్ఞానిక ప్రదర్శన ఉపయోగపడుతుందన్నారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించిన పాఠశాల ప్రిన్సిపాల్ రజని, కరెస్పాండెంట్ అమన్ ప్రసాద్‌ను ఆయన అభినందించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ రజని, కరెస్పాండెంట్ అమన్ ప్రసాద్ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలో కేవలం సైన్స్ అంశాలు మాత్రమే కాకుండా ఇతర విషయ పాఠ్యాంశాల ప్రదర్శనకు చోటు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందడానికి, జ్ఞాన సముపార్జనకు తల్లిదండ్రులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు వైజ్ఞానిక ప్రదర్శన తిలకించారు.

కలమడుగులో వాలీబాల్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గ్రామంలో నర నారాయణస్వామి ఆలయ 40వ వార్షికోత్సవ పురస్కరించుకొని యూత్ ఆధ్వర్యంలో రెండు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలను ట్రస్మ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు ప్రారంభించారు. ఈ పోటీలలో రెండు జిల్లాల నుంచి 34 జట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కిషన్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రాజు గౌడ్, గ్రామ పెద్దలు దేవేందర్ పాల్గొన్నారు.



కుష్టు వ్యాధిపై అవగాహన

నవ తెలంగాణ-తాండూర్



మండలంలోని జ్యోతిబా పూలే కస్తూర్బా, గురుకులాల్లో మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. డిప్యూటి డీఎంహెచ్ఓ సుధాకర్ నాయక్, మెడికల్ ఆఫీసర్ ఝాన్సీ రాణి కుష్టి వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణ, చికిత్సల గురించి తెలియజేశారు. నేషనల్ తబాకొ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ట్రెస్ మేనేజ్మెంట్పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఏఎండీ రాఘవయ్య, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెచ్ఈడీ లక్ష్మణ స్వామి, హల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎస్ఎం శోభ, ఆశా వర్కర్ తిరుమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంపై శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని అన్ని గ్రామాల రైతులు జీవన ఎరువుల వాడకంపై శ్రద్ధ పెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం జన్నారంలోని రైతు వేదికలో పలు గ్రామాల రైతులకు జీవన ఎరువుల వాడకం, వాటి ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. జీవన ఎరువులను వాడితే పంటలలో అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ అనిత, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, ఏఈఓలు సాయి త్రిసంధ్య దివ్య, లవన్ కుమార్, అక్రమ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-నిర్మల్

రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని పౌర సరఫరాల అధికారులు ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని పలు రేషన్ దుకాణాలలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లక్ష్మణచాంద, ఖానాపూర్, సోన్, నిర్మల్ గ్రామీణ మండలాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిర్ణీత సమయాల్లో రేషన్ దుకాణాలను తప్పనిసరిగా తెరిచి ఉంచాలన్నారు. పేదలకు సమయానికి రేషన్ బియ్యాన్ని అందించాలన్నారు. అన్ని రకాల బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని రేషన్ డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రేషన్ దుకాణాల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. తనిఖీలలో టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ శ్రీధరరెడ్డి, అధికారులు శేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, సుదర్శన్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు కార్తీక్‌రెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

ఎస్సీ మాంగ్ కులస్తులను గ్రూప్-2లో చేర్చాలి



నవతెలంగాణ-బోథ్

మాంగ్ కులస్తులను ఎస్సీ వర్గీకరణలో గ్రూప్-1 నుంచి గ్రూప్-2 కు చేర్చాలని మంగళవారం మండలంలోని ఘన్‌పూర్ గ్రామ మాంగ్ కులస్తుల ఆధ్వర్యంలో సొనాల మండలకేంద్రంలో తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2001-2004లో కొనసాగిన వర్గీకరణలో మాదిగ కులస్తులతో పాటు గ్రూప్-బి లోనే ఉండటంతో ప్రస్తుతం 2024లో డా.షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏర్పాటైన కమీషన్ కూడా మాంగ్ కులస్తులని గ్రూప్-2లో ఉంచాలని విన్నవించామని అన్నారు. ఇప్పటి నివేదికలో మాంగ్ కులాన్ని మాదిగలతో పాటు గ్రూప్-2లో కాకుండా గ్రూప్-1లో చేర్చడం సరైంది కాదని అన్నారు. ఇది మాంగ్ సమాజానికి తీవ్రమైన అన్యాయమని అన్నారు. తరతరాలుగా మాదిగ సోదరులతో పాటు సమాన వృత్తి, డప్పు కొట్టడం, చెప్పులు కుట్టడం తమ వృత్తి అన్నారు. మాంగ్ కులస్తులని గ్రూప్-1లో కాకుండా మాదిగ సోదరులతో పాటు గ్రూప్-2లో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాంగ్ కులస్తులు గ్రామప్రజలు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-బేల

మార్క్‌ఫెడ్ సౌజన్యంతో డోప్టాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారి సాయితేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా తూకం యంత్రానికి పూజలు చేసి కొనుగోళ్ల ప్రారంభించారు. కందుల కొనుగోలు గ్రామాల వారీగా జరుగుతుందని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం క్వింటాలుకు రూ.7,550 చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓలు తిరుపతి, రాహుల్, సిబ్బంది గణేష్, ప్రశాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన మహార్ సంఘం నాయకులు

నవతెలంగాణ-బోథ్

నూతనంగా ఏర్పడిన మండలంలో తహసీల్దార్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ మల్లేష్‌ను మంగళవారం మహార్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మహార్ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్ కామ్లే భీంరావ్ మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో పీఓపఏల మండలాధ్యక్షుడు పవార్ శ్యాంరావ్, నాయకులు కుమురం తులసి రామ్, నైతం శంకర్ ఉన్నారు.

రమా సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 12న ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో నిర్వహించే రమా సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవానికి రావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, నంది రెడ్డి, సంతోష్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

భూసంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



భూసంబంధిత సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు శాఖలకు సంబంధించి భూసమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన స్పందన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు రెవెన్యూ, పోలీసు కేసులతో ముడిపడి ఉన్న భూసమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రెవెన్యూ, పోలీస్ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి రెవెన్యూ, పోలీసు అధికారులకు పలుకీలక సూచనలు చేశారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా భూసమస్యలకు సంబంధించి అర్జీలను పరిష్కరించాలన్నారు. ఈ స్పందన కార్యక్రమం ద్వారా జిల్లాలో చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న పలు భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. భూ సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందిన వెంటనే అవసరమైన చోట హద్దులు గుర్తించుటకు రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో వెళ్లి భూహద్దులను గుర్తించాలన్నారు. పోలీసు శాఖతో ముడిపడి ఉన్న భూసమస్యల పరిష్కారం కోసం ప్రతి మంగళవారం తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించబడతాయని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలపై ఫిర్యాదులను అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఆర్డీఓ రత్నకళ్యాణి, తహసీల్దార్ రాజు, రెన్యూ పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని డీఈఓ పి.రామారావు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంజులాపూర్‌లో పదో తరగతి విద్యార్థులతో కలిసి టీషాట్ టీవీ ఛానెల్లో ప్రసారమవుతున్న విద్యాశాఖ సెక్రటరీ అయిన యోగితా రాణి ముఖాముఖి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యాశాఖ కార్యదర్శి రాష్ట్రంలోని విద్యార్థులు అందరూ ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమం తరువాత డీఈఓ మాట్లాడారు. నిర్మల్ జిల్లాలో ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాసే 9127 మంది విద్యార్థులు అన్ని విషయాలను క్షుణ్ణంగా సాధన చేసి, ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా మానసికంగా ధృఢంగా ఉండి, ప్రశాంతంగా పరీక్షలు రాసి విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉమ్మడి పరీక్షల బోర్డ్ సహాయ కార్యదర్శి భానుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధులు, నిబంధనలు ఇతర అంశాలపై ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్లు ఎన్. రవి, లింబాద్రి ఎన్నికల ముందు, పోలింగ్ తర్వాత నిర్వహించాల్సిన విధులపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జిల్లాలో ఏర్పాటు చేసిన 31 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రూట్, జోనల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, మరుగుదొడ్లు, విద్యుత్, ఇతర వసతులను పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల రోజు ముందు, ఉదయం పది గంటలకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు నిర్ణీత ప్రదేశానికి చేరుకొని తమకు కేటాయించిన ఎన్నికల సామాగ్రిని సరి చూసుకోవాలని తెలిపారు. పేపర్ సామాగ్రిలో ముద్రణ లోపం, చిరిగిపోయిట్లు ఉన్న వాటిని తిరిగి వెనక్కి ఇచ్చి, వేరే సామాగ్రిని తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాల పోస్టర్లు, ఓటర్లకు అవగాహన కల్పించేలా పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన 14 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదాన్ని ఓటర్లు ఓటు వేయడానికి తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పోలింగ్ ప్రారంభం కాగానే ప్రతి రెండు గంటలకు ఒకసారి నమోదైన ఓటింగ్ వివరాలను పైఅధికారులకు అందజేయాలన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సామాగ్రిని జాగ్రత్తగా నిర్దేశిత ప్రదేశాలకు చేర్చాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ), కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి మనిషికి లక్ష్యం ఉండాలి : బ్రదర్ షఫీ



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రతి మనిషి లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికి అనుగుణంగా తన జీవన ప్రయాణాన్ని సాగించాలని మాస్టర్ మోటివేటర్ బ్రదర్ షఫీ అన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని ఓ పంక్షన్ హాల్ మైదానంలో వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ నిర్మాణం-విజయానికి సోపానం అనే విషయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కాగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. ఈ సందర్భంగా మాస్టర్ షఫీ మాట్లాడుతూ ఏదైనా పనులు చేయాలంటే ముందుగా స్పష్టమైన నిర్ణయం కావాలనీ, లక్ష్యం ఉంటేనే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ప్రతి మనిషికి ఐదు లక్ష్యం ఉండాలన్నారు. వృత్తి, కుటుంపరమైన, సామాజిక, ఆధ్యాత్మిక, వ్యక్తిగత లక్ష్యాలు ఉండాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న సందర్భంగా విద్యార్థులు ఏ విధంగా ఒత్తిడిని ఏ విధంగా జయించాలి, ఉత్తీర్ణతకు ఏ విధంగా సన్నద్ధం అవలో వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రశ్నలు అడిగి సమాదానాలను రాబట్టారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో పీజీ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామానికి చెందిన చింతలపెల్లి జయశ్రీ దశరథ్‌రెడ్డి దంపతుల కుమారుడు చింతలపెల్లి సాయికృష్ణ రెడ్డి ఇటీవల సిద్దిపేట వైద్య కళాశాలలో పీజీ మానసిక వైద్య విభాగంలో సీటు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం జైనథ్ మాజీ జెడ్పీటీసీ తుమ్మల అరుందతి వెంకట్‌రెడ్డి ఆయనను అభినందించి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పీజీ విద్యను పూర్తి చేసుకొని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.



కుష్టు వ్యాధిపై అపోహలు వీడాలి



నవతెలంగాణ-నార్నూర్

ప్రజలు కుష్టు వ్యాధిపై అపోహలు వీడాలని జిల్లా కుష్టు నివారణ విభాగం వైద్యులు డాక్టర్ సాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఏంపల్లి గ్రామంలో ప్రజలకు లెప్రసీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంపై పాలిపోయిన, రాగి రంగు గల మొద్దుబారిన మచ్చలు, కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు రావడం కుష్టు వ్యాధి లక్షణాలని పేర్కొన్నారు. కుష్టు వ్యాధికి ఆధునిక చికిత్స అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా లభిస్తుందని తెలిపారు. ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే ఎలాంటి అంగవైకల్యం కలగదన్నారు. చికిత్సలో ఉన్న కుష్టు రోగులతో ఇతరులకు సోకాదన్నారు. కుష్టు రోగులను అందరూ ఆదరించాలన్నారు. అనుమానితులు దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాంబాబు, డీపీఎంఓలు వామన్‌రావ్, రమేష్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, సిబ్బంది ఉన్నారు.

పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులకు చదువు, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. పాటల రూపంలో పాడుతూ, వాటి భావం వివరించారు. చదువు ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో వివరించారు. చదువు ప్రతి మనిషికి సంస్కారం, జ్ఞానాన్ని ఇస్తుందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి వ్యాధులు రాకుండా హాయిగా జీవించవచ్చు అన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గురుకుల కళాశాలలో, కేజీబీవీల్లో, ఆదర్శ పాఠశాల పాఠశాలల్లో, ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు చాకటి రవీందర్, కళాకారులు గుంజాల రమేష్, గట్టు వెంకట్‌రావు, మామిడిపల్లి రాజలింగు, రాథోడ్ శంకర్, నగేష్, ఆశిష్, నర్సమ్మ, మదిరి రాజు, శ్రీలత, మసాలా వైస్ ప్రిన్సిపల్ లత, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారులకు అవార్డుల ప్రదానోత్సవం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ కళలు సాహితీ సంస్కృతి కవులు, కళాకారుల సమ్మేళనం మంగళవారం అంబేద్కర్ భవన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హజరై కళాకారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కళాకారులకు, ఉద్యోగ ఉపాధి కల్పిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అదే ప్రభుత్వం లాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగుతుందని అన్నారు. ఈ ప్రభుత్వం కళాకారులను ఆదుకోకున్న బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కళాకారులను తప్పక ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరినాయక్, వొడిసెల అర్జున్, జమాల్, చంద్రకాంత్, పట్టణాధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, మండలాధ్యక్షులు మార గంగారెడ్డి, వెంకట్ రెడ్డి, నాయకులు సాగర్‌రెడ్డి, పఠాని నర్సయ్య, విజయ్, గిల్లి విజయ్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల కళాకారులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తాం

నవతెలంగాణ-నార్నూర్

అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సంబంధిత శాఖ అధికారులకు సమస్యలను వివరించి, పరిష్కంచాలని ఆదేశించారు. ఇందులో గ్యాస్ సబ్సిడీ, కరెంట్ బిల్లు సబ్సిడీ రాకపోవడంతో ప్రజలు ఫిర్యాదులు చేశారు. ఆన్‌లైన్‌లో ప్రజాపాలనలో చేసిన దరఖాస్తులను పరిశీలించి, సంక్షేమ పథకాలకు అర్హులుగా పరిగణిస్తామని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులో 50పైగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్‌లాల్, తహసీల్దార్ రాజలింగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిది

నవతెలంగాణ-బోథ్

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని ఎఫ్ఎస్ఓ ఎండీ ముంతాజ్ అన్నారు. సొనాల మండల కేంద్రంలోని స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ మాట్లాడారు. అటవీతో పాటు జంతువుల సంరక్షణ బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. అలాగే అటవీకి నిప్పు పెట్టడం చట్టరీత్య నేరమని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ జాదవ్ రాధేశ్యం, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.